క్లుప్తంగా

ఉపాధ్యాయుడికి సత్కారం



పల్లం జెడ్పీహెచ్ పాఠశాలలో జగన్నాథాన్ని సన్మానిస్తున్న గ్రామస్తులు

కాట్రేనికోన: పల్లం జెడ్పీహెచ్ పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన పాలెపు జగన్నాథాన్ని స్థానికులు ఘనంగా సత్కరించారు. పల్లం జెడ్పీహెచ్ పాఠశాలలో పని చేసిన జగన్నాథం ఇటీవల కాట్రేనికోన జెడ్పీటీసీ పాఠశాలకు బదిలీపై వెళ్లారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, సహచర ఉపాధ్యాయ సిబ్బంది మాస్టారును సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పాలెపు లక్ష్మీ ధర్మారావు, సర్పంచ్ మల్లాడి వీరబాబ్జి, కోలాటి సత్యం తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

కాట్రేనికోన: పుస్తక పఠనంతో విద్యార్థులు విజ్ఞానం పెంపొందించుకోవచ్చని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వీఎల్ఎన్ఎస్వీ ప్రసాద్ అన్నారు. గ్రంథాలయ వార్షికోత్సవంలో భాగంగా కాట్రేనికోన, కందికుప్ప గ్రంథాలయాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో ప్రతి శనివారం నిర్వహించే చదవడం మాకిష్టం కార్యక్రమంపై విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. వారు చెప్పిన సమాధానాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో లైబ్రెరియనులు తులసి, శ్రీహరిరావు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బీఎస్పీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా త్రిమూర్తులు



త్రిమూర్తులును అభినందిస్తున్న పార్టీ జిల్లా నాయకులు

అమలాపురం టౌన్: జిల్లా బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) కార్యనిర్వాహక కార్యదర్శిగా కోలా త్రిమూర్తులు నియమితులయ్యారు. స్థానిక గడియారం స్తంభం సెంటరులోని వెంకటేశ్వర ప్లాజాలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సత్య చింతా అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో త్రిమూర్తులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. త్రిమూర్తులను జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమించినట్టు జిల్లా అధ్యక్షుడు సత్య ప్రకటించారు. జిల్లా పార్టీ నాయకులు కాండ్రేగుల నరసింహం, కాశి లక్ష్మీభవాని, వాకపల్లి భీమారావు, కుసుమ వెంకటేశ్వరరావు, సాకా రాజారావు, పెండల శ్రీనివాస్, బదుగు భీమేశ్వరరావు తదితరులు ప్రసంగించారు.

చిన్నారులకు పోషకాహార కిట్లు

అమలాపురం టౌన్: స్థానిక వంటెద్దు వారి వీధిలో ఆదివారం జన కల్యాణ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో హెచ్ఐవీ బాధిత చిన్నారులకు పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు, జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడు చిన్నారులకు కిట్లు అందజేశారు. కె.రిశివ్, ఏలూరి సూర్య శశాంక్ నాయుడు, జి.శేఖర్, కాశీ శ్వేత సహకారంతో పౌష్టికాహార కిట్లు సమకూర్చారు. జన కల్యాణ్ సొసైటీ ప్రతినిధి శ్రీనివాస్, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు జల్లి సుజాత, జె.ఏడుకొండలు, జి.అమల, ఎం.ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పిచ్చిమొక్కలు తొలగించండి



కనకాలపేట ఏటిగట్టు రహదారి వెంబడి చిట్టడవిలా పెరిగిన పిచ్చిమొక్కలు

యానాం: స్థానిక బైపాస్ రహదారి నుంచి నియోజకవర్గ పరిధిలోని కనకాలపేట ఏటిగట్టు రహదారి వెంబడి పెరిగిపోయిన పిచ్చిమొక్కలు తొలగించకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని గ్రామస్తులు ఆదివారం ఆందోళన వ్యక్తం చేశారు. కనకాలపేట ఏటిగట్టు రహదారి మీదుగా రోజుకు వందలాది వాహనాలు తాళ్లరేవు మండల పరిధిలోని అరటికాయలంక, గోవలంక, పిల్లంక, కె గంగవరం మండల పరిధిలోని బ్రహ్మపురి, మసకపల్లి, కోటిపల్లితో పాటు కపిలేశ్వరపురం మీదుగా జొన్నాడ వరకూ వెళుతుంటాయని, రహదారి వెంబడి ఏపుగా పెరిగిపోయిన పిచ్చిమొక్కలు వల్ల రాత్రివేళలో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. తక్షణం యానాం పీడబ్ల్యూడీ శాఖ సిబ్బంది స్పందించి జంగిల్ క్లియిరెన్స్ చేయాలని స్థానికుడు పెద్దిరెడ్డి బాబి కోరారు.

అంధులకు పండ్ల పంపిణీ

అమలాపురం రూరల్: కిమ్స్ మెడికల్ కళాశాల ఎండీ, మాజీ ఎమ్మెల్సీ కలిదిండి రవికిరణ్ వర్మ జన్మదినం సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకటసుబ్బారావు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బస్టాండ్ సమీపంలో ఉన్న అంధులకు పండ్లు, రొట్టెలు అందజేశారు. జిల్లా బీజేవైఎం ప్రధాన కార్యదర్శి బొంతు శివాజీ తదితరులు పాల్గొన్నారు.

సన్మార్గం వైపు అడుగులు వేసేలా..

- బాలబాలికలను తీర్చిదిద్దుతున్న సత్యసాయి బాలవికాస్
- చిన్నతనం నుంచే పునాది రాళ్లు

అమలాపురం టౌన్: అదో నైతిక విలువలు నేర్పే విద్యాలయం.. కుటుంబ బంధాల విలువలను చాటే మమతల కోవెల.. ఆధ్యాత్మికతను ప్రబోధించే ఆలయం భగవాన్ శ్రీసత్యసాయి సేవా సంస్థ. ఈ సంస్థ బాలబాలికలను సన్మార్గం వైపు అడుగులు వేసేలా తీర్చిదిద్దుతోంది. సత్యసాయి సేవా సంస్థల అమలాపురం జోన్‌కు అనుబంధంగా పని చేస్తున్న బాల వికాస్ బాలబాలికలకు చిన్నతనం నుంచి నైతిక విలువలను తెలిపి మంచి మార్గాన్ని అనుసరించేలా ఆదిలోనే బీజాలు నాటుతోంది.

ఐదు దశాబ్దాలుగా..

అమలాపురం జోన్ బాలవికాస్ 1969లో డాక్టర్ గోటేటి సరస్వతి ఆధ్వర్యంలో మొదలైంది. అప్పట్లో అమలాపురం, అంబాజీపేటలో మాత్రమే బాల వికాస్ కేంద్రాలు వెలిశాయి. తర్వాత పిచ్చిక రామారావు ఈ కేంద్రాలకు కర్తగా వ్యవహరించారు. ఇప్పుడు సత్యసాయి సేవా సంస్థల అమలాపురం జోనల్ కన్వీనర్ డాక్టర్ జి.ప్రభాకర్ ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. గత అయిదు దశాబ్దాల కాలంలో బాల వికాస్ కేంద్రాల నుంచి దాదాపు 15 వేల మంది విద్యార్థులు బయటకు వెళ్లారు. అమలాపురం జోనల్ పరిధి అంటే ముమ్మిడివరం, అమలాపురం, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల పరిధిలో ఉన్న మండలాలు, గ్రామాలు ఉన్నాయి. 50 ఏళ్ల కిందట కేవలం రెండు కేంద్రాలతో మొదలైన బాల వికాస్ కేంద్రాలు నేటికి 45 కేంద్రాలకు విస్తరించాయి. 15 ఏళ్ల లోపు బాలబాలికలు ఈ కేంద్రాలో విద్యను అభ్యసించవచ్చు. పిల్లల వయస్సులను బట్టి 1, 2, 3 గ్రూపులుగా విభజించారు. ఈ 45 కేంద్రాల్లో ప్రస్తుతం 789 మంది పిల్లలు విద్యార్థులు ఉన్నారు. 60 మంది బాల వికాస్ గురువులు పనిచేస్తున్నారు. వీరికి ప్రతి ఆదివారం నైతిక విలువలు, కుటుంబ బంధాలు, ఆధ్యాత్మిక చింతనలపై శిక్షణ ఇస్తున్నారు. అమలాపురం బాల వికాస్ ప్రధాన కేంద్రంలో గురువు శిష్టా గుణ రంజన్ మొత్తం కేంద్రాల గురువులను సమన్వయం చేస్తుంటారు. గురువు గుణ రంజన్ కూడా ఒకప్పుడు ఇక్కడ విద్యార్థే. బాల వికాస్‌లోనే మహిళా గురువు చీకట్ల భవాని కూడా ఆడ పిల్లలకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పిస్తారు.

నేర్పించే అంశాలు

బాల వికాస్ కేంద్రాల్లో గురువులు సమాజ, కుటుంబ, ఆరోగ్య, ఆధ్యాత్మిక హితమైన అంశాలపై అవగాహన కల్పిస్తారు. అబద్ధాలు చెప్పకూడదు, హింసకు దూరంగా ఉండాలి. శాఖహారం భుజించాలి. పెద్దలు, గురువులపై గౌరవం, అమ్మ నాన్నల విలువ, మమతానురాగాలు, నీతి కథలు, పురాణ గాథలు, ఆధ్యాత్మిక భావనలు, మహనీయుల జీవిత చరిత్రలు ఎలా ఎన్నో బోధిస్తారు. భగవాన్ సత్యసాయి బాబా చెప్పిన నీతి మార్గాన్ని ఈ పిల్లలకు నేర్పుతూ వారిని సన్మార్గంలో నడిపిస్తారు.



అమలాపురంలో అహింసపై అవగాహన కల్పిస్తున్న బాలవికాస్ జోనల్ కన్వీనర్ డాక్టర్ ప్రభాకర్, బాలవికాస్ కేంద్రాల్లో పిల్లలకు జరుగుతున్న శిక్షణ తరగతులు (ఫైల్)

చిన్నారుల్లో పరివర్తనే ధ్యేయంగా..

బాలబాలికలు రేపటి తరంలో నీతిమంతులై మెలగాలన్నదే సత్య సాయిసేవా సంస్థల ధ్యేయం. బాలబాలికల్లో ఈ పరివర్తన బీజాల కోసమే బాలవికాస్ ద్వారా విద్యనందించి తీర్చిదిద్దుతున్నాం. అమలాపురంలో బాల వికాస్ స్థాపించిన గత 54 సంవత్సరాల్లో వేలాది మంది చిన్నారులను ఆ దిశగా తయారు చేసి సమాజహితం కోసం, వారి వ్యక్తిత్వ వికాసం కోసం జీవించేలా చేస్తున్నాం.



– డాక్టర్ జి.ప్రభాకర్, శ్రీసత్యసాయి సేవా సంస్థలు, అమలాపురం జోన్ కన్వీనర్

శ్మశాన వాటిక స్థల సమస్య పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎండీయూడబ్ల్యూఏ అధ్యక్షుడు రమేష్

తాళ్లరేవు: గాడిమొగ పంచాయతీ పరిధిలోని బాబానగర్ గ్రామానికి సంబంధించి శ్మశానవాటిక స్థల సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఎండీయూడబ్ల్యూఏ అధ్యక్షుడు పెయ్యల రమేష్, బీఎస్పీ ప్రతినిధులు వాకపల్లి భీమారావు, మాత సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆదివారం బాబానగర్‌లో ప్రభుత్వం కేటాయించిన శ్మశాన వాటిక స్థలాన్ని వారు పరిశీలించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ బాబానగర్ గ్రామవాసులకు శ్మశానం లేకపోవడం దారుణమన్నారు. ఇటీవల ప్రజల కోరిక మేరకు సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిని ఉపయోగించుకునేందుకు అధికారులు అనుమతించడం అభినందనీయమన్నారు. అయితే గాడిమొగకు చెందిన గ్రామస్తులు అభ్యంతరాలు తెలపకుండ ఆయా శ్మశాన స్థలాన్ని పూర్తిస్థాయిలో సర్వే చేసి, హద్దులు ఏర్పాటు చేసి గ్రామానికి దాఖలు చేయాలని కోరారని, ఆ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎండీయూడబ్ల్యూఏ ఉపాధ్యక్షుడు మోకా దుర్గాప్రసాద్, కార్యదర్శి తాడి షణ్ముఖరాజు, బీఎస్పీ నాయకులు కమిడి శ్రీను, కుసుమ శ్రీనివాస్, దడాల శ్రీనివాస్, మోర్త విజయ్ గల్లా చందు తదితరులు పాల్గొన్నారు.

కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు



బెల్ట్‌లు, సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో కోచ్‌లు

అమలాపురం టౌన్: స్థానిక విశ్వ బ్రాహ్మణ కమ్యూనిటీ హాలులో పవర్ కిక్ షోటోకాన్ కరాటే డు అసోసియేషన్ ఆధ్వర్యంలో బెల్ట్ గ్రేడింగ్ పరీక్షా పోటీలు ఆదివారం జరిగాయి. ఈ పోటీలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో కరాటే విద్యార్థులు బెల్ట్ గ్రేడింగ్ కోసం నువ్వా నేనా అన్నట్లుగా ప్రతిభ చాటారు. పోటీలకు హాజరైన విద్యార్థులకు కరాటే చీఫ్ కోచ్ పడాల అంజి ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అంజితోపాటు కోచ్ చిక్కం సురేష్‌లు విజేతలకు బెల్ట్‌లు, సర్టిఫికెట్లు అందజేశారు. పోటీలను డి.సాయిబాబు, ఎ.రవి, ఎం.కుమార్, టి.యశ్వంత్, ఎస్.భార్గవ్‌లు పర్యవేక్షించారు.

వైద్య ఖర్చులకు సాయం



నాగూరికు ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న వెంకన్న

యానాం: చిన్న వయస్సులోనే కంటి చూపు కోల్పోయిన బాధితురాలి వైద్య ఖర్చుల కోసం ఎన్ఆర్ఐ ఆర్థిక సాయం అందజేశారు. ఐపోలవరం మండలం భైరవపాలెం పేద మత్స్యకార గ్రామానికి చెందిన 16ఏళ్ల బాలిక అంకాడి నాగూరి పక్షవాతం రావడంతో కంటి చూపు కోల్పోయింది. వైద్యం కోసం 10 లక్షలు ఖర్చు అవుతుందని డాక్టర్లు చెప్పారు. ఆమె తండ్రి అంకాడి వీరబాబు అంత స్తోమత లేక దాతలను అర్థిస్తున్నారు. ఈ నేపథ్యంలో అమెరికాలో ఉంటున్న యానాంకు చెందిన ఎన్ఆర్ఐ చింతా వెంకటగణేష్ రూ.25వేల ఆర్థిక సాయం పంపించారు. ఈ సందర్భంగా శారదా విద్యానికేతన్ పీఈటీ చింతా వెంకన్న ఆ మొత్తాన్ని బాధితురాలకు అందజేశారు. చిన్నవయస్సులోనే కంటి చూపును కోల్పోతున్న నాగూరి గురించి తెలుసుకున్న ఆయన ఆమె వైద్యానికి ఈ మొత్తాన్ని అందజేశారు. సహృదయంతో దాతలు ముందుకు వస్తే 9666080707 ఈ నంబర్‌కు ఫోన్‌పే గానీ, గూగూల్‌పే గానీ చేయవచ్చని కోరారు.

నాణ్యమైన మత్స్య ఉత్పత్తులే లక్ష్యం



వినియోగదారులకు చేపలను అందజేస్తున్న ఎంపీపీ రాయుడు సునీత

తాళ్లరేవు: వినియోగదారులకు నాణ్యమైన మత్స్య ఉత్పత్తులను తక్కువ ధరలకు అందించే లక్ష్యంతో ప్రభుత్వం ఫిష్ ఆంధ్రా మినీ రిటైల్ అవుట్‌లెట్లను ఏర్పాటు చేస్తోందని ఎంపీపీ రాయుడు సునీత అన్నారు. ఆదివారం స్థానిక చెరువుగట్టు సెంటర్‌లో రచ్చా పద్మ ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్రా మినీ రిటైల్ అవుట్‌లెట్‌ను ఆమె ప్రారంభించారు. ప్రజలకు తాజా చేపలు, రొయ్యలు తదితర వాటిని నాణ్యతతో అందించేందుకు ఏర్పాటు చేసినట్టు ఎంపీపీ తెలిపారు. జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, ఫిషరీస్ ఏడీ లావణ్య, ఎఫ్‌డీఓ జి.గోపి, ఎంపీటీసీ సభ్యుడు రచ్చా ముత్యాలు, నాయకులు రాయుడు గంగాధర్, రెడ్డి రెడ్డిబాబు, నందికోళ్ల శ్రీమన్నారాయణ, కొల్లు శ్రీను, విత్తనాల రామకృష్ణ, బొంతు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై గ్రామాల్లో పర్యటన



గ్రామాల్లో విద్యుత్ సమస్యలను తెలుసుకుంటున్న ఏఈ హరిబాబు

అమలాపురం రూరల్: విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్టు విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ అప్పారి హరిబాబు తెలిపారు. ఆదివారం ఆయన గ్రామాల్లో పర్యటించారు. గ్రామ సర్పంచులతో సమావేశమైన విద్యుత్ సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. తాండవపల్లి, చిందాడగురువు సమనస, నడిపూడి, పాలగుమ్మి బండారులంక, సాకుర్రు, గున్నేపల్లి అగ్రహారం వనిచింతలపూడి కామనగరువు, పేరూరు, నల్లమిల్లి జనుపెల్లి, ఎ.వేమవరం, వేమవరంప్పాడు గ్రామాల్లో లైనమెన్, అస్టింటెంట్ లైన్‌మెన్లతో వెళ్లి అంతా పరిశీలించారు. లైన్ల, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు, లోఓల్టేజ్, కొత్త స్తంభాలు తదితర సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తామని ఇంజినీర్ హరిబాబు తెలిపారు. మండల సర్పంచుల సమైఖ్య అధ్యక్షురాలు నక్క అరుణకుమారి, సర్పంచులు పొనాకల గణేష్, దాసరి అరుణకుమారి, చెల్లుబోయిన నాని, పెనుమాల సునీత, నక్కా రాజారత్నం, గుత్తుల చిరంజీవి, పందిరి విజయ, గంగుమళ్ల ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు,

వార్డు ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు



గుత్తాల జ్యోతి, మూడో వార్డు టి.కొత్తపల్లి, ఐ.పోలవరం మండలం (మెజార్టీ 104 ఓట్లు)



ఉల్లింగి సంధ్యకుమారి, నాలుగో వార్డు, కొమరగిరిపట్నం పంచాయతీ, అల్లవరం మండలం (మెజార్టీ 95ఓట్లు)



వాసంశెట్టి రామలక్ష్మి, ఆరో వార్డు, పాలగుమ్మి, అమలాపురం రూరల్ (ఏకగ్రీవం)

రాజీవ్ గాంధీకి ఘన నివాళి



మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు తదితరులు



రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

అమలాపురం టౌన్: దేశ మాజీ ప్రధాన మంత్రి దివంగత రాజీవ్ గాంధీ జయంతిని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వంటెద్దు బాబి ఆధ్వర్యంలో స్థానిక నల్ల వంతెన వద్ద ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వంతెన వద్ద ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నియోజకవర్గ పార్టీ సమన్వయ కమిటీ కన్వీనర్ మహ్మద్ ఆరిఫ్ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ సేవలను కొనియాడారు. ఏఐసీసీ సభ్యుడు యార్లగడ్డ రవీంద్ర, పీసీసీ డెలిగేట్స్ అయితాబత్తుల సుభాషిణి, దోనిపాటి విజయలక్ష్మి, నాయకులు తోపెల్ల సుబ్రహ్మణ్యం, వెంకటరమణ, మహ్మద్ షకీలా పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: భారత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతిని కాంగ్రెస్ పార్టీ మండల నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉప్పలగుప్తం, గొల్లవిల్లి, భీమనపల్లి గ్రామాల్లో ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అయితాబత్తుల సుభాషిణి, దామిశెట్టి జయ, నిమ్మకాయల నాగేంద్ర ప్రసాద్, ఆకుల వెంకట రెడ్డి నాయుడు, అయితాబత్తుల కుమార్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

అల్లవరం: స్థానిక హైస్కూల్ సెంటర్లో మాజీ ప్రధాని రాజీవ్ విగ్రహం వద్ద ఆదివారం ఘన నివాళులర్పించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాధనాల సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పీసీసీ సభ్యురాలు అయితాబత్తుల సుభాషిణీ, మాజీ ప్రధాని రాజీవ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ముమ్మిడివరం: స్థానిక బుద్ధ పార్కులో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు పెన్మత్స జగ్గప్పరాజు, వడ్డి నాగేశ్వరరావు, పి.ఉదయ భాస్కరవర్మ, గోడి భాస్కరరావు, కే.అచ్యుతరామయ్య, గుబ్బల రవి పాల్గొన్నారు.

యానాం: స్థానిక గౌతమీగోదావరి తీరంలో రాజీవ్ రివర్ బీచ్ వద్ద ఉన్న పార్క్‌లో మాజీ ప్రధాని దివంగత రాజీవ్‌గాంధీ కాంస్య విగ్రహానికి రీజినల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామి తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎస్పీ రఘునాయగం, సిఐ షణ్ముగం, పీఆర్ఏ కొల్లు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మోటారు వాహనాల ప్రమాదాలపై అవగాహన



ట్రిపుల్ రైడింగ్‌పై యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ గోవిందరాజు

రాజోలు: మోటార్ వాహనాల ప్రమాదాలపై ద్విచక్ర వాహనదారులకు రాజోలు సీఐ గోవిందరాజు ఆదివారం అవగాహన కల్పించారు. ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న యువకులను నిలుపుదల చేసి కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రస్తుతం దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్న దృష్ట్యా దూర ప్రయాణాలకు వెళ్లే యజమానులు ఎల్‌హెచ్ఎంఎస్ సేవలను వినియోగించుకోవాలన్నారు. ప్రయాణాలకు వెళ్లే వారు అధిక నగదు, బంగారు వస్తువులను బ్యాంకు లాకర్లలో డిపాజిట్ చేసుకోవాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు, అనుమానితులు సంచరిస్తే వెంటనే ఆ సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలన్నారు.

దోమల నిర్మూలనలో భాగస్వాములవ్వాలి

మామిడికుదురు: ప్రపంచ దోమల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం పలు గ్రామాల్లో వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. దోమల నివారణ పద్ధతులను వివరిస్తూ నినాదాలు చేశారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై అవగాహన కల్పించారు. దోమల ద్వారా వచ్చే వ్యాధులు, లార్వా నిర్మూలన చర్యలు, దోమ తెరల వాడకం, దోమల మందు పిచికారీ చేయించడం, వ్యాధి నిర్ధారణ, సరైన చికిత్స తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మొగలికుదురులో జరిగిన ర్యాలీలో సూపర్‌వైజర్లు సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, ఏఎన్ఎం మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన భవన నిర్మాణానికి విరాళాలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన భవన నిర్మాణానికి రాజమహేంద్రవరానికి చెందిన పి.కల్యాణ్‌రెడ్డి, కేఆర్‌వీకే మహాలక్ష్మి దంపతులు రూ.31,116, అనపర్తికి చెందిన కె.మణికంఠరెడ్డి రూ.25 వేల విరాళం అందించినట్లు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. దాతలకు ఈఓ చేతుల మీదుగా స్వామి చిత్రపటం అందజేశారు.

ఎల్జీ కార్యాలయం మార్పు

యానాం: ఎంతో చరిత్ర ఉన్న పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ నివాసమైన రాజ్‌నివాస్‌గా చరిత్రకెక్కి గ్రేడ్ 1ఏ హెరిటేజ్ భవనం నిర్మించి వందేళ్లవుతోంది. ఈ నేపథ్యంలో పీడబ్ల్యూడీ అధికారులు నివేదిక ప్రకారం దానిని మూసివేయడానికి ప్రభుత్వం నిర్ణయించింది. రాజ్‌నివాస్‌లోనే పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ నివాసంతో పాటు ఆఫీసు కార్యాలయం కూడా ఉండేది. అయితే ప్రస్తుతం రాజ్‌నివాస్ భవనానికి మరమ్మతులు చేసే వరకూ ఒక ఏడాది పాటు ఎల్జీ కార్యాలయాన్ని బీచ్‌రోడ్డులోని వైథికుప్పం పక్కన ఓల్డ్ డిస్టలరీ కాంప్లెక్స్‌లో కొత్తగా నిర్మించిన భవనంలోకి మారుస్తున్నట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో సీఎం రంగసామి, పీడబ్ల్యూడీ మంత్రి లక్ష్మీనారాయణన్ నూతన ఎల్జీ భవనాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఎల్‌డీసీ పరీక్షకు ఏర్పాట్లు

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఎల్‌డీసీ, స్టోర్ కీపర్ పోస్టుల భర్తీకి ఈ నెల 27న నిర్వహించే పోటీ పరీక్షకు ఏర్పాట్లు చేసినట్లు ఆదివారం పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫామ్స్ అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా పుదుచ్చేరి వ్యాప్తంగా 137 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. యానాంలో 10, మాహేలో 6, కారైకల్‌లో 14, పుదుచ్చేరిలో 107 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. హాల్‌టికెట్లను ×రిక్రూట్‌మెంట్.పీవై.జీఓవీ.౯ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 0413–2233338 నంబరుకు అన్ని పని వేళల్లో ఫోన్ చేయవచ్చునని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

యానాం: యానాం కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకువస్తామని ఆ పార్టీలో చేరిన పలువురు నాయకులు పేర్కొన్నారు. ఆదివారం రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకుని జరిగిన భారీ బహిరంగ సభకు యానాం నుంచి పుదుచ్చేరికి ప్రత్యేక వాహనంలో బయలుదేరి వెళ్లి అక్కడ పుదుచ్చేరి పీసీసీ అధ్యక్షుడు, ఎంపీ వైద్యలింగం, మాజీ సీఎం నారాయణసామి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మల్లాడి సత్తిబాబు, అర్దాని దినేష్, మల్లాడి బీరాస్వామి, దున్నా చక్రవర్తి, లంకే నాగూర్, అంజియ్య తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. గతంలో యానాం నియోజకవర్గాభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ఎంతో కృషి చేసిందన్నారు.

పోలీస్ శాఖ విజ్ఞప్తి

అయినవిల్లి: అయినవిల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల్లో తరచుగా దొంగతనాలు జరుగుతున్నాయి. కావున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అలాగే వీలైనంత వరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే మంచిదని, ప్రజలందరూ ఒక్కటై ఈ దొంగతనాలు అరికట్టేలా అడుగు వేయాలని అయినవిల్లి ఎస్సై ఎస్.నాగేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎవరైనా ఇల్లు వదిలి కొన్ని రోజులు బయటికి వెళ్లే ఉద్దేశముంటే వెంటనే సమీపాన పోలీస్టేషన్‌కి లేదా గ్రామ సచివాలయం మహిళా పోలీస్‌కు సమాచారం ఇచ్చి వెళ్లాలని సూచించారు. అలాగే దొంగతనాల విషయంలో ఎవరి మీదయినా మీకు అనుమానం ఉంటే తక్షణమే పోలీసు వారికి సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

ర్యాలి ఆలయ అభివృద్ధికి విరాళం

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయ అభివృద్ధికి హైదరాబాద్‌కు చెందిన మిరయంపల్లి శ్రీధర్ రూ.15,232, బెంగళూరుకు చెందిన వాసా శ్రీనివాసరావు రూ.5,116 విరాళం అందించినట్లు ఈఓ బి.కృష్ణ చైతన్య తెలిపారు. దాతకు సిబ్బంది స్వామి చిత్రపటం అందజేశారు.

అలీ అస్గర్‌కు ముస్లింల నివాళి

మామిడికుదురు: షియా మతస్తుల ఆరాధ్య దైవం హజరత్ ఇమామ్ హుస్సేన్ తనయుడు ఆరు నెలల పసికందు షహజాదే అలీ అస్గర్‌కు ముస్లింలు ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. నగరం గ్రామంలోని మొల్లా పంజా నుంచి అలీ అస్గర్ ఊయలను తీసి గ్రామ వీధుల్లో ఊరేగించారు. సజ్జాద్ హుస్సేన్ సాజిద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. మత ప్రబోధకుడు అబ్బాస్ బాఖరి మజ్లిస్ ఆలపించారు. సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నగరం పెద పంజీషా వరకు ఊయల ఊరేగింపు జరిగింది. ఊయల ఊరేగింపులో గుండెలు బాదుకుంటూ మాతం నిర్వహిస్తూ అలీ అస్గర్‌కు నివాళులర్పించారు.

ముగ్గురి అరెస్టు

మామిడికుదురు: ఆదుర్రులో కోడి పందేలు ఆడుతున్న ముగ్గుర్ని అరెస్టు చేశామని నగరం ఎస్సై పి.సురేష్ ఆదివారం తెలిపారు. కోడి పందేలు ఆడుతున్న వారిపై శనివారం సాయంత్రం దాడి చేసి పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.1,650 నగదు స్వాధీనం చేసుకున్నామని, పందెం కోళ్లను పట్టుకున్నామని చెప్పారు. మండలంలో ఏ విధమైన అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా వెంటనే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని ఎస్సై హెచ్చరించారు.